# చెర వీడినట్లేనా..?



ఆక్రమణలు తొలగిన తర్వాత లెనిన్ సెంటర్

ఎట్టకేలకు లెనిన్‌సెంటర్‌కు మోక్షం కలిగింది. ఈ ప్రాంతంలో ఆక్రమణలను అధికారులు తొలగించారు. ఇద్దరి ముగ్గురి చేతిలో ఉన్న ఈ ప్రాంతంలో చిరువ్యాపారులు ఇబ్బంది పడ్డారు. అయితే అధికార పార్టీకి చెందినవారికి ఇవ్వడానికే ఇక్కడ ఆక్రమణలు తొలగించారనే విమర్శలు వస్తున్నాయి. అయితే ఇక్కడ మాఫియా చెర వీడినట్లేనా స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

- దశాబ్దాలుగా 'మాఫియా'కు అడ్డాగా లెనిన్‌సెంటర్
- ముగ్గురు నలుగురు వ్యక్తుల చేతిలోనే..
- చిరువ్యాపారులకు ఇక్కడ బతుకులేదు

**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** నగరంలో లెనిన్‌సెంటర్ ప్రముఖ వ్యాపార కేంద్రం. ఓవైపు సోషలిస్టు నేత వీఐ లెనిన్.. మరోవైపు జ్ఞానపీఠ అవార్డు గ్రహీత విశ్వనాథ సత్యనారాయణ విగ్రహాలు ఈ సెంటర్‌కు ప్రత్యేకత. పండుగలు పబ్బాలు వచ్చాయంటే ఈ సెంటర్‌లో ఇసుకేస్తే రాలనంతగా జనంతో సందడి. కాలు తీసి కాలుపెట్టలేనంత రద్దీ.. కారణం వ్యాపార కేంద్రం కావడమే. దీన్ని అవకాశంగా తీసుకున్న కొందరు మాఫియాగా తయారై సెంటర్‌ను తమ చెప్పు చేతల్లో తీసుకున్నారు. అధికార పార్టీ నాయకుల అండదండలతో పేట్రేగిపోతున్నారు. రోడ్డుపైనే అడ్డదిడ్డంగా.. ఎక్కడ పడితే అక్కడ షాపులు, బండ్లు పెట్టడం...ఒకటి రెండు .. అంతకు మించి షాపులు ఏర్పాటు చేసి వాటిని తమ ఆధీనంలో పెట్టుకుని అద్దెకు ఇచ్చి దర్జాగా సంపాదించడం. కేవం ముగ్గురు నలుగురు వ్యక్తులే ఈ సెంటర్‌ను శాసిస్తున్నారు. లక్షల్లో సంపాదిస్తున్నారు. ఇక్కడ ఎవరైనా చిరువ్యాపారులు వస్తే వారికి ఇబ్బందులు తప్పవు. వీళ్ల ఏర్పాటు చేసిన షాపులు, బండ్లు తీసుకుని వ్యాపారం చేసుకోవాలి. గతం నుంచి కొందరు అధికారులు వీరికి వత్తాసు పలుకుతూ వచ్చారు.

**ఇష్టానుసారంగా..**

లెనిన్ సెంటర్‌లో కొందరు చిరువ్యాపారులు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా దశాబ్దాలుగా వ్యాపారం చేస్తున్నారు. రోడ్డు మార్జిన్‌లోనో.. సర్వీసు రోడ్డులోనో షాపులు ఏర్పాటు చేసుకుని సజావుగా వ్యాపారాలు చేస్తున్నారు. వీరికి ఆటంకం కలిగిస్తూ మాఫియా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

**ఎన్నో ఏళ్లుగా ఆందోళన..**

లెనిన్ విగ్రహం చుట్టూ ఆక్రమణలు తొలగించాలని ఎన్నో ఏళ్లుగా సీపీఐ నాయకులు ఆందోళన చేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్లకు వినతి పత్రాలు సమర్పించారు. అయినా క్రమేణ షాపులు పెరుగుతూ వచ్చాయేగానీ అసలు ఆక్రమణలు తొలగనే లేదు. పోలీసు ఔట్ పోస్టు ఏర్పాటు చేస్తే దాని చుట్టూ కూడా షాపులు ఏర్పాటు చేశారు. అటు పోలీసులు గానీ, ఇటు మున్సిపల్ అధికారులుగానీ పట్టించుకోలేదు. సెంటర్ పూర్తిగా ఆక్రమణలకు గురై సామాన్య జనం అక్కడ నిలబడడానికి కూడా వీల్లేని పరిస్థితి నెలకొంది. ఇక ఆ రోడ్డులో తిరిగే బస్సుల డ్రైవర్లు అయితే నిత్యం నరకం అనుభవించారు.

**చెర వీడిన సెంటర్..**

ఎట్టకేలకు మున్సిపల్ అధికారులు లెనిన్, విశ్వనాథ విగ్రహం చుట్టూ ఉన్న ఆక్రమణలు తొలగించారు. ఈ పరిణామంతో నగర వాసులు సంతోషం వ్యక్తం చేశారు. రోడ్డు మధ్యలో షాపులు తొలగించడంతో ఆ సెంటర్‌కు వచ్చిన వారంతా తమ బండ్లు నిలుపుకుంటున్నారు. ఆక్రమణల చెర వీడుతుందని, సెంటర్ ఇంత ప్రశాంతంగా ఉంటుందని తాము భావించలేదని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అయితే రోడ్డు మధ్యలో ఆక్రమణలే కాకుండా ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా మార్జిన్లు, సర్వీసు రోడ్డులో చిరువ్యాపారులను తొలగించడంపై విమర్శలు వస్తున్నాయి. రెండు రోజుల క్రితమే ఆక్రమణలు తొలగించారు. అయితే ఇక్కడ చక్రం తిప్పుతున్న ఓ వ్యక్తి ఇంతలోనే షాపు ఏర్పాటు చేశారు. దీంతో లెనిన్ సెంటర్ పూర్తిగా చెర వీడినట్లేనా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అధికార పార్టీకి సంబంధించిన వారు వ్యాపారం చేసుకునేందుకు స్థలాలు అప్పగించేందుకు ఆక్రమణలతోపాటు మిగిలిన షాపులు తొలగించారని విమర్శలు వినపడుతున్నాయి. మాఫియాను గుర్తించి వారిని పూర్తిగా అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**ప్రత్యామ్నాయం చూపాలి**



లెనిన్‌సెంటర్‌లో ఆక్రమణలు తొలగించాలని ఎప్పటి నుంచో కోరుతున్నాం. ఇన్నాళ్లకు తొలగిపోయాయి. అయితే ఇక్కడ మాఫియా లక్షల్లో సంపాదించింది. వారిని అరికట్టాలి. వాస్తవంగా చిరువ్యాపారులను గుర్తించి అండగా ఉండాలి. వారికి ప్రత్యామ్నాయం చూపాలి.

–దోనేపూడి శంకర్, సీపీఐ

## క్లుప్తంగా

### సామ్రాజ్యవాదం నశించాలి

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు



**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు పిలుపునిచ్చారు. మంగళవారం అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్‌లో సీఐటీయూ ఆధ్వర్యాన.. అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, క్యూబా సంఘీభావ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమెరికా ఖండంలో సామ్రాజ్యవాదానికి పక్కలో బల్లెంలాగా క్యూబా పోరాడుతోందన్నారు. ప్రాణాలనైనా అర్పించి సోషలిస్టు దేశాన్ని కాపాడుకోవడానికి అక్కడి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. క్యూబాపై ఆర్థిక ఆంక్షలు మితిమీరిపోయాయన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు, నేతలు రమాదేవి, ఆర్.వి నరసింహారావు, కె.ఆర్.కె మూర్తి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివి

**పాయకాపురం(విజయవాడరూరల్):** పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్‌లైన్ల మరమ్మతులు జరుగుతుండటంతో పలుప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.రవీంద్రబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కండ్రిక, జర్నలిస్ట్ కాలనీ, న్యూ రాజీవ్‌నగర్, విద్యాసాగర్, ఉద్యోగనగర్ కాలనీ, ఎంఐజీ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

**అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):** సింగ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఇందిరానాయక్‌నగర్ 11కేవీ ఫీడర్ పరిధిలో ఉన్న విద్యుత్‌లైన్ల వార్షిక తనిఖీ, మరమ్మతుల నేపథ్యంలో బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ పి.రవీంద్రబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అల్లూరి సీతారామరాజు వీధి, పోస్ట్‌మెన్ రామచంద్రరావు వీధి, జమ్మి చెట్టు రోడ్డు, వానపాల వారి వీధి, సాయిరామ్ వీధి, అయ్యప్ప స్వామి టెంపుల్ రోడ్, సింగ్‌నగర్ ఫ్లై ఓవర్ వెంబడి ఆర్‌యూబీ రోడ్డు, జార హోటల్ ఏరియా. హోండా షో రూం, పెట్రోలు బంకుల పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

### భక్తిశ్రద్ధలతో పరిశుద్ధ సిలువ మార్గం



**అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):** సింగ్‌నగర్ ఆర్‌సీఎం చర్చి నిర్వహించిన పరిశుద్ధ సిలువ మార్గం మంగళవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఆర్సీఎం చర్చి విజయవాడ పీఠాధిపతులు డాక్టర్ తెలగతోటి జోసఫ్ రాజారావు ఆశీస్సులతో సింగ్‌నగర్ ఆర్సీఎం చర్చి విచారణ కర్త రెవ.ఫాదర్ జి.జోజి నేతృత్వంలో ఈ పరిశుద్ధ సిలువ మార్గాన్ని చేశారు. మరియ తల్లి, ఏసుక్రీస్తు ప్రతిమలను భుజాలపై ఎత్తుకొని సింగ్‌నగర్ పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. అనంతరం ఫాదర్ జోజి దివ్య బలిపూజను నిర్వహించారు.

### కుళాయిల నుంచి మురికినీరు



**మధురానగర్(విజయవాడసెంట్రల్):** స్థానిక 32వ డివిజన్ పేరు గొప్ప ఊరు దిబ్బ చందంగా మారింది. నగరంలోనే ప్రతిష్టాత్మకమైన లోటస్ ల్యాండ్ మార్క్ తదితర ప్రాంతాలు ఉన్న డివిజన్‌లో నాలుగు రోజులుగా కుళాయిల నుంచి తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. కుళాయిల నుంచి మురికినీరు సరఫరా అవుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వీఎంసీకి తాగునీరు మురికిగా ఉందని ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని విచారం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

### గుర్తు తెలియని వృద్ధుడు మృతి

**పాయకాపురం(విజయవాడరూరల్):** గుర్తు తెలియని వృద్ధుడు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. నున్న రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ మహాలక్ష్ముడు తెలిపిన వివరాల ప్రకారం 62 ఏళ్ల వృద్ధుడు ప్రకాష్‌నగర్ లో రోడ్డు పక్కన పడి ఉన్నాడు. చికిత్స నిమిత్తం ఈ నెల 17న విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందినట్టు తెలిపారు. ఎరుపురంగు, తెలుపుషర్టు, నలుపు రంగు షార్ట్ ధరించిఉన్నాడు. కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీలో మృతదేహం ఉందని, నున్న పోలీసు స్టేషన్లో సంప్రదించ వచ్చని తెలిపారు.

## మాస్టర్ కాంపిటేషన్‌లో కేఎల్‌రావు స్విమ్మర్ల ప్రతిభ



ప్రతిభ చూపిన కేఎల్‌రావునగర్ స్విమ్మర్లు

**చిట్టినగర్(విజయవాడపశ్చిమ):** రాష్ట్ర స్థాయి మాస్టర్స్ కాంపిటేషన్ స్విమ్మింగ్ పోటీల్లో కేఎల్‌రావు స్విమ్మింగ్ పూల్‌కు చెందిన పలువురు సీనియర్ స్విమ్మర్లు వివిధ కేటగిరిల్లో ప్రతిభ కనబర్చి బహుమతులను సాధించినట్లు కోచ్ ఎస్‌కే రఫీ పేర్కొన్నారు. మంగళవారం కేఎల్‌రావు స్విమ్మింగ్‌పూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన మాస్టర్ స్విమ్మిర్లను కోచ్ రఫీ, కార్పొరేషన్ అధికారులు అభినందించారు. 50–54 ఏళ్ల మహిళల విభాగంలో ఎండీ షమీ ఫ్రీస్టైల్‌లో గోల్డ్ మెడల్, బెస్ట్ స్ట్రోక్ విభాగంలో గోల్డ్ మెడల్, వంద మీటర్ల ఫ్రీస్టైల్ విభాంగలో గోల్డ్ మెడల్‌ను సాధించారు. 20–24 ఏళ్ల మహిళల విభాగంలో షేక్ అర్షద్ 200 మీటర్లు, 400 మీటర్ల ఫ్రీస్టైల్‌లో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. 25–29 ఏళ్ల విభాగంలో బి.పృధ్వీ 50 మీటర్ల బెస్ట్ స్ట్రోక్స్ విభాగంలో మూడో స్థానంలో నిలిచారు. 35–39 ఏళ్ల విభాగంలో వైవీడీజీ కృష్ణారెడ్డి 400 మీటర్ల ఫ్రీస్టైల్ విభాగంలో మూడో స్థానంలో, 35–39 ఏళ్ల విభాగంలో వంద మీటర్లు బెస్ట్ స్ట్రోక్ విభాగంలో ఎస్. గణేష్‌కుమార్ మూడో స్థానంలోనూ, 40–44 ఏళ్ల విభాగంలో కె. కిశోర్ 50 మీటర్లు ఫ్రీస్టైల్, బెస్ట్ స్ట్రోక్ విభాగంలో మూడో స్థానాంలో నిలిచారన్నారు. 50–54 ఏళ్ల విభాగంలో ఎల్. శ్రీనివాసరావు 50 మీటర్లు ఫ్రీస్టైల్ విభాగంలో మూడో స్థానంలో, 55–59 ఏళ్ల విభాగంలో రవిచాన్‌రెడ్డి 50 మీటర్ల ఫ్రీస్టైల్, బెస్ట్ స్ట్రోక్‌లో మొదటి స్థానాల్లో నిలిచి గోల్డ్ మెడల్, 100 మీటర్ల బెస్ట్ స్ట్రోక్ విభాగంలో రెండో స్థానంలో సిల్వర్ మెడల్ సాధించారన్నారు.

## నైపుణ్య గణన ఎన్యూమరేటర్లకు శిక్షణ

**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** వచ్చే నెలలో ప్రారంభం కానున్న నైపుణ్య గణనకు సంబంధించి సిబ్బందికి కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో మంగళవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. జిల్లాలోని ఒక్కో మండలంలో సెక్రటేరియేట్‌లోని డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్‌బాబు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు శ్రీనివాస్, నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు ఎన్యూమరేటర్లకు దిశానిర్దేశం చేశారు. వారు మాట్లాడుతూ నైపుణ్యాలను తెలుసుకొని వారికి ఉపాధి కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం నైపుణ్య గణనకు శ్రీకారం చుట్టిందన్నారు. ఇప్పటికే గుంటూరు జిల్లా మంగళగిరి, తాడికొండ నియోజక వర్గాల్లో పైలెట్ ప్రాజెక్టుగా గణన చేసి పూర్తి చేశారన్నారు. క్షేత్రస్థాయిలో సచివాలయాన్ని యూనిట్‌గా తీసుకొని సదరు సచివాలయ జనవాసాలను క్లస్టర్‌గా విభజిస్తారన్నారు. ఒక్కో క్లస్టర్‌కు ఒక ఎన్యూమరేటర్‌ను నియమించి సర్వే నిర్వహిస్తారన్నారు. ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరించాలని కోరారు.

## విజయవాడ డివిజన్‌లో రన్ ఫర్ యూనిటీ



రన్ ఫర్ యూనిటీలో డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

**రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):** ఆధునిక భారత దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించి, దేశ సమైక్యతకు కృషిచేసిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలను స్మరించుకుంటు దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో 'రన్ ఫర్ యూనిటీ' క్యాంపెయిన్ నిర్వహించినట్లు విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ పేర్కొన్నారు. మంగళవారం రైల్వే స్టేషన్ తూర్పు ప్రవేశ ద్వారం వద్ద పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏడీ ర్ఎంలు పి.ఈ ఎడ్విన్, కొండా శ్రీనివాసరావు, పలు బ్రాంచ్ అధికారులు, ఆర్‌పీఎఫ్ సిబ్బంది. భారత్ స్కౌట్ అండ్ గైడ్స్, స్కూల్ విద్యార్థులతో కలసీ క్లాక్ టవర్ నుంచి పాత ప్రభుత్వాస్పత్రి మీదుగా కాల్టెక్స్ రోడ్డులో ప్లకార్డులు చేతపట్టుకుని రన్ ఫర్ యూనిటీ క్యాంపెయిన్‌లో పాల్గొన్నారు.

**రైల్వే ఆడిటోరియంలో..**

విజయవాడ డివిజన్‌లో జరుగుతున్న విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా రైల్వే ఆడిటోరియంలో రైల్వే అధికారులు, ఉద్యోగులతో విజిలెన్స్ అవగాహనపై సెమినార్ నిర్వహించారు. దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డెప్యూటీ జనరల్ మేనేజర్ (ఎస్‌డీజీఎం), చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ (సీవీఓ) డి.వినయన్ విజిలెన్స్ అంశాలపై అవగాహన కల్పించారు.

## వేధింపుల కేసు నమోదు

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** భర్త, అత్తమామలు వేధిస్తున్నారంటూ గుణదల పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళానికి చెందిన పిట్ట మానస తల్లిదండ్రులు కుటుంబ సభ్యులతో కలిసి పనుల నిమిత్తం నగరానికి వచ్చారు. 2022లో ఓ మైనర్ తొమ్మిదో తరగతి చదువుతున్నప్పుడు వరుసకు మేనమామైన సూరిబాబు ప్రేమించాలంటూ వెంటపడేవాడు. సూరిబాబు ఆ బాలికను తన అక్క ఇంటికి తీసుకెళ్లి బలవంతం చేశాడు. దీంతో పెద్దల సమక్షంలో 2022లో బాలికకు సూరిబాబుతో వివాహం చేశారు. ఆ తర్వాత భర్త, అత్తమామలు వేధిస్తుండటంతో మంగళవారం బాలిక గుణదల పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పర్యావరణహిత దీపావళి చేద్దాం



జీఎస్‌రాజు రోడ్డులో అవగాహన ప్రదర్శన

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** పర్యావరణ హిత దీపావళి చేద్దామని సత్యనారాయణపురం ట్రాఫిక్ సీఐ కిషోర్‌బాబు సూచించారు. దీపావళి పండుగను పురస్కరించుకొని సత్యనారాయణపురం ఆక్స్‌ఫర్డ్ ఒలింపియాడ్ స్కూల్ ఆధ్వర్యాన మంగళవారం జీఎస్‌రాజు రోడ్డులో గో ఫర్ గ్రీన్ దివాళి– సేవ్ నేచర్ పేరుతో అవగాహన ప్రదర్శన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొని అవగాహన ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సంస్కృతి సంప్రదాయాలను తెలుసుకునేందుకు ఇటువంటి ప్రదర్శనలు దోహదపడతాయని అన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ మాధురి మాట్లాడతూ బాణసంచాను మితంగా కాల్చి ప్రకృతి పరిరక్షణకు సహకరించాలని కోరారు. పాఠశాల ఆర్.ఐ. ఉమారాణి, ఉపాధ్యాయులు ఎస్.శాంతిశ్రీ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## రైల్వే హాస్పటల్‌లో స్ట్రోక్‌పై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ శౌరిబాల

**రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):** వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా మంగళవారం విజయవాడ రైల్వే హాస్పటల్ న్యూ ఓపీడీ భవనంలో స్ట్రోక్‌పై అవగాహన, స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. రైల్వే హాస్పటల్ సీఎంఎస్ డాక్టర్ శౌరిబాల మాట్లాడుతూ స్ట్రోక్‌కు దారి తీసే పరిస్థితులు, దాని నివారణ చర్యలపై రైల్వే లబ్ధిదారులకు అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశమని ఆమె తెలిపారు. ఆకస్మికంగా స్ట్రోక్ వచ్చినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, గోల్డెన్ అవర్ ప్రాముఖ్యాన్ని వివరించారు. మెడ్‌స్టార్ హాస్పటల్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ డాక్టర్ బి.హేమేశ్వరరావు స్ట్రోక్‌పై వివరించారు. క్రమం తప్పకుండా వ్యాయామం, సమతుల్య ఆహారం, మధుమేహం, కొలెస్ట్రాల్ స్థాయి పరీక్షలు చేయించుకుంటూ సరైన చికిత్స తీసుకోవాలని సూచించారు. అనంతరం రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు స్క్రీనింగ్ పరీక్షలు, ఆర్‌బీఎస్, మూత్రపిండాల పనితీరు, లిపిడ్ ప్రొఫైల్, ఈసీజీ తీశారు. కార్యక్రమంలో ఏసీఎంఎస్ డాక్టర్ జైదీప్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ఆర్ఆర్ కళాశాలను సందర్శించిన కళాశాల విద్య డైరెక్టర్



ఎస్ఆర్ఆర్ కళాశాలలో రికార్డులు పరిశీలిస్తున్న కళాశాల విద్య డైరెక్టర్ డాక్టర్ నారాయణ భరత్‌గుప్తా

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** ఇటీవల కళాశాల విద్య డైరెక్టర్‌గా నియమితులైన డాక్టర్ నారాయణ భరత్ గుప్తా మంగళవారం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహిస్తున్న తరగతులు, విద్యాబోధన, సదుపాయాలు తదితర వివరాలు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మమేకం అయి విద్యాబోధన, వసతులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కళాశాల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**గురుకుల కళాశాలను సందర్శించిన గుప్తా**

ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో నిర్వహిస్తున్న కంచికచర్ల సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా కళాశాలను గుప్తా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులను కలిసి మాట్లాడారు. కళాశాలలో అందిస్తున్న సేవల గురించి ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కళాశాల విద్యార్థినులు, అధ్యాపకులతో కలిసి కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు.

**విశ్వనాథ లోగిలి తొలి సంచిక ఆవిష్కరణ**

కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యాన నూతనంగా ప్రారంభించిన విద్యార్థి చేతిరాత పత్రిక 'విశ్వనాథ లోగిలి' తొలి సంచికను డైరెక్టర్ డాక్టర్ నారాయణ భరత్ గుప్తా ఆవిష్కరించారు. పత్రికను నిర్వహిస్తున్న తెలుగు విభాగం సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి

**భవానీపురం(విజయవాడపశ్చిమ):** కబేళా సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం పేరెంట్స్, టీచర్స్‌తో సమావేశం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ హాఫీజ్ షేక్ అహ్మద్ మాట్లాడుతూ కళాశాలలో చదువుకుంటున్న పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. విద్యార్థుల ప్రగతిపై క్లాస్ టీచర్‌తో మాట్లాడి తమ పిల్లల చదువు ఎలా ఉంది, విద్యా బోధన ఎలా ఉంది, హాజరు శాతం ఎలా ఉంది వంటి సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని చెప్పారు.

## నత్తనడకన యూజీడీ పనులు



**మధురానగర్(విజయవాడసెంట్రల్):** మధురానగర్ మెయిన్ రోడ్డులో మురుగుకాలువ పనులు, రాగం మస్తాన్‌రావు రోడ్డులో యూజీడీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇక్కడ పనులు ప్రారంభించి వారం రోజులు కావస్తోంది. పనుల్లో పురోభివృద్ధి కనిపించడం లేదు. నిత్యం రద్దీగా ఉండే రాగం మస్తాన్‌రావు రోడ్డు, సాయిబాబా కాలనీలో రోడ్డును తవ్వి యూజీడీ పైపులు వేశారు. రోడ్డును మాత్రం సరిచేయలేదు. దీంతో వాహన చోదకులు ఇబ్బందిపడుతున్నారు. మెయిన్ రోడ్డులో మురుగుకాలువ పనుల్లో భాగంగా మెట్లు తీసేసి వారం కావస్తున్నా పనులు పూర్తికాకపోవడంతో నివాసితులు అవస్థ పడుతున్నారు. అధికారులు స్పందించి పనులు త్వరితగతిన పూర్తిచేసి తవ్విన రోడ్లు సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

## ఘనంగా ఆయుర్వేద దినోత్సవం

**పాయకాపురం(విజయవాడరూరల్):** ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ న్యూ రాజీవ్‌నగర్‌లో మంగళవారం ఆయుర్వేద పితామహుడు ధన్వంతరి జయంతి , 9వ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా భగవాన్ ధన్వంతరి పూజలు నిర్వహించి ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించారు. అనంతరం రంగోలి కార్యక్రమాలు, పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. రాజీవ్‌గాంధీ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఆయుర్వేద సంస్థ ఉద్యోగులు, ఓపీ రోగులు పాల్గొన్నారు. సంస్థ ఇన్‌చార్జి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు ఔషధ మొక్కలను పంపిణీ చేశారు. సీనియర్ పరిశోధన అధికారి డాక్టర్ ఏజేవీ సాయిప్రసాద్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## బైక్ దొంగకు ఏడు నెలల జైలు, జరిమానా

**విజయవాడస్పోర్ట్స్:** రైల్వేస్టేషన్‌లో బైక్‌ను దొంగిలించిన వ్యక్తికి ఏడు నెలల జైలు శిక్ష విధిస్తూ విజయవాడ మూడో అడిషనల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి నామాల జ్యోతి మంగళవారం తీర్పు చెప్పారు. విజయవాడ రైల్వేస్టేషన్‌లో పని చేస్తున్న వ్యక్తి తన బైక్‌ను స్టేషన్ క్లాక్ టవర్ వద్ద పార్కింగ్ చేసి విధులకు హాజయ్యాడు. విధులు ముగించుకుని వచ్చేసరికి బైక్ కనిపించకపోవడంతో బాధితుడు సత్యనారాయణపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 8న వెలుగు చూసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అప్పటికే గుడివాడలో బైక్‌ను దొంగిలించి అక్కడి పోలీసుల అదుపులో ఉన్న రాజమండ్రి సమీపంలోని కొత్తమద్రు గ్రామానికి చెందిన సన్నాల నాగరాజును పీటీ వారెంట్‌పై అరెస్ట్ చేసి మార్చి 15న కోర్టులో హాజరుపర్చారు. ఏడుగురు సాక్షులను విచారణ చేసిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు నాగరాజుకు జైలు శిక్షతో పాటు రూ.3 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉమావతి వాదనలు వినిపించారు.



## వల.. చేపలు ఇలా..







విజయవాడ ప్రకాశం బ్యారేజీ దిగువన మంగళవారం కొందరు మత్స్యకారులు చేపల కోసం నది మధ్యలోకొచ్చి వల వేశారు. అలా వేశారో లేదో ఇలా చేపలు వలలో పడ్డాయి. ఈ దృశ్యాలను 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ